రేపు ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలు

కుత్బుల్లాపూర్: శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ 394వ జయంతి మహోత్సవాలను రేపు(సోమవారం) ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్య క్షత్రియ సంఘం సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీన సుచిత్రలోని శివాజీ సర్కిల్ వద్ద వేడుకలు నిర్వహించే వేడుకలకు ప్రజలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

'ఎస్సీ, ఎస్టీ' ఎంప్లాయీస్ నూతన కమిటీ



ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ నూతన కమిటీ

కుత్బుల్లాపూర్: తెలంగాణ సచివాలయ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కమిటీ శనివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా జి.ప్రశాంత్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఎస్.కిశోర్‌కుమార్, ఎం.రమేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా రాము భూక్యా, అదనపు కార్యదర్శులుగా టి.రాజీవ్ చంద్, ఎస్.సమత, కోశాధికారిగా బి.సోమన్న ఎన్నికయ్యారు. ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ కాన్ఫిడరేషన్ రాష్ట్ర కన్వీనర్ కె.శ్రీనివాస్‌రావు, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల కన్వీనర్ బేకు ఆనంద్‌బాబు సమక్షంలో జరిగిన సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు.

బీఆర్ అంబేడ్కర్ దినచర్య పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న భూపాల్

నిజాంపేట్: అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శమని పంచశీల ఎడ్యుకేషన్ సొసైటీ ఫౌండర్ కమ్మెట భూపాల్ అన్నారు. బాచుపల్లి ప్రజలకు రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ దినచర్య పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ గొప్ప మేధావి అని, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం రాజ్యాంగం రచించారని గుర్తుచేశారు. అలాంటి వ్యక్తి దినచర్య, క్రమశిక్షణ తదితర విషయాలు తెలుసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నారాయణ, బీఆర్ఎస్ నిజాంపేట్ కార్పొరేషన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిన్న భూపాల్, కృష్ణ, బలరాం, గోవర్ధన్, రాజేందర్ పాల్గొన్నారు.

చెత్త సేకరణకు బ్యాగులు అందజేత



బ్యాగులు అందజేస్తున్న కౌన్సిలర్ శంకర్‌నాయక్

దుండిగల్: తడి, పొడి చెత్తను ఇంటి వద్దే వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు అందించాలని దుండిగల్ మున్సిపాలిటీ 27వ వార్డు కౌన్సిలర్ శంకర్‌నాయక్ సూచించారు. ఈమేరకు తండాలో శనివారం ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పించడంతో పాటు బ్యాగులు అందజేశారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. చెత్త సేకరణ కోసం మున్సిపల్ సిబ్బంది ఇంటింటికి తిరుగుతున్నట్టు తెలిపారు. డ్రైనేజీ, ఇతర బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడేయడం వల్ల దోమలు వృద్ధి చెందే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ శాంత, మంజుల, రెడ్డి నాయక్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరలో పూర్తి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జగన్

జగద్గిరిగుట్ట: పెండింగ్ పనులను త్వరలోనే పూర్తి చేస్తామని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్ తెలిపారు. శనివారం డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో రూ.12 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, గిరిబాబు, విట్టల్, వెంకటేశ్, సిద్ధయ్య, గోపాల్ పాల్గొన్నారు.

బురదమయంగా బస్తీ రహదారి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జగన్

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ కట్ట మైసమ్మ బస్తీలోని ప్రధాన మార్గాన్ని సీసీ రోడ్డుగా మార్చేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. భూగర్భ డ్రైనేజీ లేకపోవడంతో రోడ్లపైనే మురుగు వదులుతుండటంతో రహదారి మొత్తం బురదమయంగా మారుతోంది. అధికారులు తక్షణమే సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఈ చార్ట్‌తో దరఖాస్తు విధానం ఈజీ

సుభాష్‌నగర్: ప్రభుత్వ పథకాలు, ఇతర సర్వీసులు పొందాలంటే మీసేవ కేంద్రాల నుంచి దరఖాస్తులు తీసుకోవాల్సిందే. దీంతో నిత్యం మీసేవ సెంటర్ల వద్ద ప్రజలు పడిగాపులు కాస్తుంటారు. అయితే, సర్టిఫికెట్ల కోసం ఏయే పత్రాలు జతచేయాలో తెలియని దరఖాస్తుదారులకు తెలియని పరిస్థితి. దీంతో కొంపల్లి మున్సిపల్ దూలపల్లి మీసేవ నిర్వాహకుడు సాగర్‌బాబు సర్టిఫికెట్ల కోసం జత చేయాల్సిన పత్రాల చార్ట్ ఏర్పాటు చేశారు.



చార్ట్ వివరాలు తెలుపుతున్న సాగర్‌బాబు

రోడ్లపైనే వాహనాలు

- మాదాపూర్ ఏరియాలో నిత్యం ట్రాఫిక్ జామ్
- పనికిరాని వాహనాలు సైతం రోడ్ల పక్కనే
- భవన నిర్మాణ సామగ్రి, వ్యర్థాలు రోడ్లపైనే
- ఉద్యోగులు, పాదచారుల వెతలు



మాదాపూర్‌లోని చందానాయక్ తండా, సర్వే ఆఫ్ ఇండియా ప్రాంతాలలో రోడ్లపై అస్తవ్యస్తంగా పార్క్ చేసిన వాహనాలు

మాదాపూర్: మాదాపూర్ ఐటీ ప్రాంతం కావడంతో రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. నిత్యం ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. దీనికితోడు మాదాపూర్ ప్రాంతంలో రోడ్లపై వాహనాలు ఎక్కడపడితే అక్కడ అస్తవ్యస్తంగా నిలుపుతున్నారు. మాదాపూర్‌లోని చంద్రనాయక్ తండా, అయ్యప్పసొసైటీ, సర్వే ఆఫ్ ఇండియా, సాయినగర్ తదితర ప్రాంతాలలో రోడ్లపై వాహనాలను ఇష్టానుసారంగా నిలుపుతుండడంతో కార్యాలయాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఐటీ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ప్రధాన రోడ్లపై బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నా పార్కింగ్‌కు స్థలం వదలక పోవడంతో వచ్చిన వారు రోడ్లపై పెడుతున్నారు.
- ఈ ప్రాంతంలో సెకండ్ హ్యాండ్ కార్ల స్టోర్‌లు ఎక్కువగా ఉండడంతో పాడైన వాహనాలను రోడ్ల పక్కన పెడుతున్నారు.
- కొంతమంది రైల్వే స్టేషన్‌కు, బస్టాప్‌లకు వెళ్ళి పనులయ్యాక రాత్రికి వచ్చి తీసుకువెళుతున్నారు.
- ఇలా రోడ్లపై పెట్టిన వాహనాలను ట్రాఫిక్ అధికారులు పట్టించుకుపోవడంతో ఇది మరింత జఠిలంగా మారింది.
- అంబులెన్స్‌లు సైతం వెళ్లడానికి వీలు లేకపోవడంతో వెనుదిరిగి పోయిన సందర్భాలు ఉన్నాయన్నారు.
- ఇక మాదాపూర్ పరిసర ప్రాంతాలలో ఎక్కువగా భవన నిర్మాణ పనులు జరుగుతుండడంతో ఐరన్, ఇటుక, ఇసుక, సిమెంట్‌లను రోడ్లపై ఉంచడంతో రోడ్లు కుంచించుకుపోతున్నాయని, రాకపోకలకు ఇబ్బందిగా ఉందని ప్రజలు వాపోతున్నారు.
- జీహెచ్‌ఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు.



రోడ్లపై అడ్డంగా వాహనాలు నిలపడంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు





అయ్యప్పసొసైటీ, చందానాయక్ తండాలో రోడ్లపై ఇసుక, ఐరన్, ఇటుకలు

అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం



సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ కృష్ణవేణి

దుండిగల్: వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని మున్సిపాలిటీ పరిధిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని దుండిగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ కృష్ణవేణి సూచించారు. ఈమేరకు మున్సిపల్ కార్యాలయంలో శనివారం అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. వీటితో పాటు అసంపూర్తిగా ఉన్న మ్యాన్‌హోళ్లు, వీధి లైట్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాకింగ్ ట్రాక్ తదితర పనులను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ పద్మారావు, ఏఈ ప్రవీణ్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

డి.పోచంపల్లి 7వ వార్డులో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను చైర్‌పర్సన్ కృష్ణవేణి, వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్ రాము గౌడ్‌తో కలిసి కృష్ణవేణి ప్రారంభించారు. అదే విధంగా మల్లంపేటలోని సాయి బాలాజీ ఎంక్లేవ్‌లో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, మహేందర్ యాదవ్, రమాదేవి, సాయి యాదవ్, అనంత స్వామి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు అభినందనలు

దుండిగల్: గండిమైసమ్మ–దుండిగల్ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సయ్యద్ మతీన్‌ను పలువురు కౌన్సిలర్లు శనివారం అభినందించారు. గండిమైసమ్మలోని రెవెన్యూ కార్యాలయంలో ఆయనను కలిసి శాలువతో సత్కరించారు. వారిలో వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, మహేందర్ యాదవ్, సాయి యాదవ్, గోపాల్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, భరత్‌కుమార్ తదితరులున్నారు.



తహసీల్దార్ సత్కరిస్తున్న కౌన్సిలర్లు

హాస్యవల్లరి.. నృత్య ప్రదర్శనలు

శిల్పారామంలో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం హాస్యవల్లరి, భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలను ప్రదర్శించారు. శ్రీరాగ రమ్య సోషల్ అండ్ కల్చరల్ సంస్థ రమ్య ఆధ్వర్యంలో సరాగాలు సిరి నృత్య హాస్యవల్లరి కార్యక్రమాన్ని నిర్వహించారు. హాస్యబ్రహ్మ డాక్టర్ శంకర్ నారాయణ హాస్యవల్లరి సందర్శకులను ఆకట్టుకుంది. రశ్మిత, అనిల్‌కుమార్, ప్రశాంతి, జయశ్రీ శిష్యబృందం కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు అలరించాయి. ఇందులో మహాగణపతిం, శ్లోకాలు, రామదాసు కీర్తనలు, అన్నమాచార్య కీర్తన, బృందావన తిల్లాన, గణేశకౌతం, మూషికవాహన తదితర అంశాలను ప్రదర్శించారు. అనంతరం కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు.

విద్యార్థులకు కరాటే సర్టిఫికెట్లు అందజేత



సర్టిఫికెట్లతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

కుత్బుల్లాపూర్: కార్మిక నాయకుడు, షాపూర్‌నగర్ ప్రభుత్వ పాఠశాల డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ ముద్దాపురం మదన్‌గౌడ్ పాఠశాలలోని 200 మంది విద్యార్థులకు ఉచితంగా కరాటేలో శిక్షణ అందిస్తున్నారు. ఈక్రమంలో మదన్‌గౌడ్ తండ్రి ముద్దాపురం దత్తాత్రేయ 28వ వర్ధంతి సందర్భంగా శనివారం విద్యార్థులకు కరాటే సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మదన్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూతనందించేందుకు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో మదన్‌గౌడ్ కుటుంబ సభ్యులు డాక్టర్ సుమస్మిత, దేవదత్తు, హైందవి, కరాటే మాస్టర్లు రవి, శ్రీధర్, సంతోశ్, ప్రశాంత్, ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డి, రామారావు, శుభాష్, రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎగ్జామ్ కిట్స్ అందజేత



ఎగ్జామ్స్ మెటీరియల్ అందుకున్న విద్యార్థులు

జగద్గిరిగుట్ట: హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు ఎగ్జామ్స్ మెటీరియల్ అందజేశారు. కుత్బుల్లాపూర్‌లోని అనాథ పిల్లలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని సింగిల్ పేరెంట్ విద్యార్థులు మొత్తం కలిపి 25 మందికి ఎగ్జామ్ కిట్స్ అందించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు టి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. తన పుట్టిన రోజును పురస్కరించుకొని తనకు సహకారం అందించిన డాక్టర్ కాచం సత్యనారాయణకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సామాజికవేత్త మధుబాబు, సభ్యులు నగేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరణ్‌సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు రక్షణ కల్పించాలి

చింతల్: ఆకతాయిల నుంచి విద్యార్థినులకు రక్షణ కల్పించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ప్రియాంక శనివారం డిమాండ్ చేశారు. కుత్బుల్లాపూర్, షాపూర్‌నగర్ తదితర ప్రాంతాలలో బస్టాపుల వద్ద ఆకతాయిలు, పోకిరీలు ధూమపానం చేస్తూ విద్యార్థినులకు వేధిస్తున్నారని చెప్పారు. ఇలాంటి వారిపై పోలీసులతో పాటు షీ టీం బృందాలు నిఘా పెట్టాలని కోరారు.

పరీక్ష ఫీజుల చెల్లింపునకు గడువు పెంపు

మూసాపేట: ఓపెన్ స్కూల్ 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల ఫీజు గడువు ఈ నెల 21తో ముగుస్తుందని మూసాపేట ప్రభుత్వ పాఠశాల ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ బురాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతికి ఒక్కో సబ్జెక్టుకు రూ.25ల అపరాధ రుసుముతో ఈ నెల 27 వరకు, రూ.50ల అపారాధ రుసుముతో మార్చి 4వ తేదీ వరకు చెల్లించవచ్చని తెలిపారు. ఇంటర్ ఒక్కో సబ్జెక్ట్‌కు రూ.150ల చొప్పున మార్చి 4వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు.

25న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

హఫీజ్‌పేట్ : మియాపూర్ గాయత్రీ బ్రాహ్మణ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25 తేదీన 13వ రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికను మియాపూర్ జనప్రియ అపార్టుమెంట్స్‌లోని షిర్డి సాయిబాబా ఆలయంలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రతినిధి మూర్తి శనివారం పేర్కొన్నారు. స్పాట్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉందన్నారు. మరిన్ని వివరాలకు 99483 21233, 79814 13159లో సంప్రదించవచ్చు.

వేడుకగా కేసీఆర్ పుట్టినరోజు

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలు శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. ఆ పార్టీ నాయకులు కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. జగద్గిరిగుట్ట బస్‌స్టాప్ వద్ద కార్పొరేటర్ జగన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు హాజరయ్యారు. కార్పొరేటర్లు రావుల శేషగిరి, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు వివిధ ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

ముగిసిన తెలుగు సాహిత్య మహాసభలు



వేదికపై రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో జరిగిన తెలుగు సాహిత్య మహాసభలు శనివారం ముగిశాయి. ఆర్ట్స్ కాలేజీ 133 తరగతిలో జరిగిన ముగింపు కార్యక్రమానికి రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మూడు రోజుల పాటు వివిధ అంశాలపై జరిగిన సమావేశాల్లో అనేక అంశాలను ప్రస్తావించారు. దేశ వ్యాప్తంగా 25 వర్సిటీల తెలుగు విభాగం అధ్యాపకులు పాల్గొని వర్తమాన తెలుగు భాష సాహిత్యం గమనం, గమ్యం తదితర అంశాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో కవులు, కళాకారులు, రచయితలు, అధ్యాపకులు, సినీ దర్శకులు, పత్రిక సంపాదకులు, పరిశోధన విద్యార్థులు తదితరులు కవితా పొద్దులో పాల్గొని భాష, సాహిత్యంపై కథలు, కవిత్వం, ఆట, పాటలతో ఆలోచింపచేయగా 300 మంది ప్రతినిధులు హాజరైనట్లు నిర్వాహకులు ప్రొ.కాశీం తెలిపారు.

'సీఐటీయూ' యూనియన్ ఏర్పాటు



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్సై యాదగిరి

కుత్బుల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎంవీ యాక్ట్ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్ కోరారు. శనివారం షాపూర్‌నగర్ మార్కెట్ ఆటో స్టాండ్ డ్రైవర్ల ఆధ్వర్యంలో నూతనంగా సీఐటీయూ యూనియన్ ఏర్పాటైంది. కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఎంవీ యాక్ట్ వల్ల డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అంతేకాకుండా అనంతరం జీడిమెట్ల ట్రాఫిక్ ఎస్సై యాదగిరి డ్రైవర్లకు యూనియన్ కార్డులు, స్టిక్కర్లు, యూనిఫాంలు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అంజయ్య, దేవదానం, ఆటో యూనియన్ నాయకులు ఎస్కే ఖలీల్, శ్రీనివాస్, జహీర్, కాజా, వెంకట్ రాజు, యూసుఫ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఓటరు నమోదు



ఓటరు నమోదు కార్యక్రమం

నిజాంపేట్: బాచుపల్లిలోని నందనవనం కాలనీలో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ఓటరు నమోదు ప్రోగ్రామ్ చేపట్టారు. బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు ఆధ్వర్యంలో ఆర్‌ఆర్‌ఆర్ టెక్ సొల్యూషన్స్ కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యక్రమం జరిగింది. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ పేర్లు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో పుచ్చలపల్లి అజయ్ రెడ్డి, కృష్ణారెడ్డి, రఘురెడ్డి, తరుణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే వారికి కాంగ్రెస్‌లో గుర్తింపు



హరివర్ధన్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నేతలు

కుత్బుల్లాపూర్: కష్టపడి పని చేసే కాంగ్రెస్ పార్టీలో వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు శనివారం నాయకులను మర్యాదపూర్వంగా కలిశారు.

సుభాష్‌నగర్ కమిటీ ఎన్నిక..

సుభాష్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ శనివారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా సోమన్న గారి శ్రీధర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హరికిరణ్ ఆకుల, ప్రధాన కార్యదర్శిగా ద్వారంపూడి నాగిరెడ్డి, కోశాధికారిగా విజయభాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎస్.చందు, వినోద్ కుమార్, రవీందర్ రెడ్డి, ఎండీ యూసఫ్, కదం రాహుల్, నాగేశ్వర్‌రెడ్డి, సెక్రటరీలుగా గ్యాస్‌ఫర్, కొమరయ్య, యూసఫ్, శేఖర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలు అనిత, ఫజియా, బాలాజి గౌడ్, స్వాతి, లక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు అంజిరెడ్డి, ఎన్.జగదీష్, అప్సర్, కె.శ్రీనివాస్, సంతోషి, రవి ఎన్నికయ్యారు.